

# పులి

ఎ.బి. చంద్ర

సీతాలు రొప్పుతున్నాడు.

వలశై పైబడ్డ వయసు అతని మాట వినడానికి మొరాయిస్తోంది.

కాళ్ళు వణుకుతున్నాయి. ఎగశ్వాస గుండెల్ని పిండేస్తుంది.

అడవిలో చిందరవందరగా పడివున్న ఎండు పుల్లలు అప్పుడప్పుడు అతని అరికాళ్ళలో గుచ్చుకుంటూ నరకాన్ని చూపెడుతున్నాయి.

అయినా అతను పరుగునాపటం లేదు.

అలా ఎంత సేపు పరుగెత్తాడో!

అమ్మగారి కోనేరు, పీరిబడి, గంగానమ్మ చెట్టు, ఆంజనేయస్వామి గుడి, వీటన్నింటినీ దాటుకుంటూ పరుగెత్తాడు.

వాటిల్లో ఏ ఒక్కటీ అతనలా ఎందుకు పరగలు కక్కుతూ పరుగెడుతున్నాడో అడగలేదు.

అలా అడిగిందెవరు?

వెంకయ్యనాయుడు.

ఆ ఊరి మోతుబరి రైతు కమ్ ప్రజా నాయకుడు.

అప్పుడు పెదవి విప్పాడు సీతాలు.

"బా...బా...వు...లీ!"

శ్వాస మాటల్ని తినేస్తుంది. చీకటి వెలుగుని మింగేసినట్టు.

పీతాలు కళ్ళు మూసుకున్నాడు.

అదే దృశ్యం-కళ్ళకి అంటుకు పోయిన దృశ్యం!

ఎండుపొలాల మధ్య భయంకరంగా రక్తసిక్తమైన గేదె!

నల్లటిశరీరం మీద రక్తం జిగటగా జేగురువర్ణంతో యముని ఫాలభాగంలో సిందూరంలా వుంది.

మెడ నరాలు తెగి తల వెనక్కి వాలింది. మూపురం దగ్గర కండ తెగి అంతదూరాన పడింది. చిన్న చిన్న జీవులు ఆత్రంగా విందు చేసుకుంటు న్నాయి. నిన్నటివరకూ ఆ గేదె పాలు అమ్మకొని వచ్చిన డబ్బుల్తో పిల్లల కింత గంజినీళ్ళు పోయగలిగే స్థితిలో వున్న తమ ఈ రోజు!

ఉన్న ఒక్క ఆధారం పోయింది. పైగా దానికోసం బేంకువాళ్ళిచ్చిన అప్పు మీదపడ్డది.

పీతాలు చెప్పుకుపోతున్నాడు

"అయ్యా! ఉన్న ఒక్క ఆదరువూ పోయింది బాబూ! ఆ మాయదారి పులి మీదపడి మా గేదెను కాదు బాబూ మా బతుకుల్ని బరుసుకు తినేసింది బాబూ! మీరే రచ్చించాలి దరమప్రెబువులు."

వెంకయ్యనాయుడి నోట్లోంచి మేఘాల్లాగ పొగలు లేస్తున్నాయి.

"దాన్దేముందిలేరా! తినడాని కిన్ని గింజలివ్వలేనట్రా- అంత ఇదై పోతా వేంటి? అపిరిగాడ్నడిగి ఓ కుంచం గింజలు కొలుసుకుపో."

"అదికాదు బాబూ!" నసిగాడు పీతాలు "నచ్చిన పసువెలాగా సచ్చింది బాబూ! నా నెత్తిమీద అప్పు పెట్టి పోయింది గదా బాబూ!"

"నీకు ముందుగాల్నే చెప్పాను కదరా! నీ కెందుకురా ఈ బేంకులతో వెవహారం అంటే 'నా కాళ్ళమీద నిలబడతాను-నిలబడతాను' అని కూలిపని మానేసి మరీ కొనుక్కున్నావు గేదెని. ఇప్పుడది కాస్తా చచ్చికూర్చుంది. సరే! చావు ఎవరికైనా తప్పదు. అలాగని బేంకువాళ్ళూరుకుంటారా? ఊరుకోరు గదా!"

పీతాలు మనసులో పీకుతున్న భయానికి ఆజ్యం పోసాడు వెంకయ్యనాయుడు

"మరెలాగ బాబూ! సొమ్మేమిటి నేను దాసుకోలేదు గదా! సచ్చినదానికి నేనేటి సెయ్యను."

"అలాగని చెప్తే వొగ్గెస్తారా! అసలు నీ గేదె అడివి కెందుకెళ్ళింది?"

"మేతకు బాబూ."

"మేత మేపుకోడానికి అడివి మీదకు పంపమని బేంకోళ్ళు చెప్పారా! చక్కాగా ఇంటికాడే వాలుగడ్డి పరక లేసుకుని పాలు పిండుకుని బతకమన్నారుగాని మేత కోసం అలా వీదులంటా అడివి లంటా తిప్పేసిమన్నారేంటి?"

"తమరే ఎలాగైనా రక్షించాలి బాబూ"

"ఆలోచిద్దాం. తొందరేముందీ. పైగా యిప్పుడే ఎలక్షన్లొచ్చి పడ్డాయా! క్షణం తీరిక లేదు."

"అలా కాదనకండి బాబూ-ముప్పైత్తు కోవాల."

"ఓర్నీయమ్మా నేను కాదన్నానేంట్రా- చూద్దాంలే- ముందు నా బిగ్గింజలు తీసుకుని పో- నేజూస్తాగా!"

సీతాలు వంగివంగి దణ్ణం పెట్టుకుంటూ గింజలు కొలిపించుకోవటానికి కొట్టం వైపు నడిచాడు.

వెంకయ్యనాయుడు ఆలోచనలను వెలిగిస్తున్నాడు. ఆ రోజు ఉదయం పూజారి రామావధాన్లు చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి.

"అయ్యా! యీసారి ఎలక్షన్లలో తమరు జాగ్రత్తగా వుండాలి. ఈ అలగా జనంతో యీసారి పెద్ద యిబ్బందే రావొచ్చు. వాళ్ళ శ్రమని మీరు దోచుకుంటున్నారని వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారనీ ఎవరో వాళ్ళకి నూరిపోసి వట్టున్నారు. పైకి మీకు దండాలు పెట్టినా ఓట్లు మాత్రం అవతలపార్టీ వాళ్ళకి వేసే ప్రమాదం లేకపోలేదు. కనుక అయ్యా- తస్మాత్ జాగ్రత్త."

వెంకయ్యనాయుడు చుట్ట చేత్తో పుచ్చుకుని నోటిని మున్నాలా చుట్ట పొగ మెల్లమెల్లగా వదులుతున్నాడు.

గూడెంవాళ్ళ ఓట్లు ఎంత లేదన్నా అయిదొందల చిల్లరే వుంటాయి. ఇప్పుడి సీతాలుగాడ్ని ఎరగా వాడుకుంటేనేగాని ఆ ఓట్లు చేతికి చిక్కవు. అలా చిక్కాలంటే సీతాలుగాడి బేంకు అప్పు మాపీ చేయించాల...

ఆ మర్నాడు వెంకయ్యనాయుడు బ్యాంకుకెళ్ళాడు. తన ఓట్లు గురించి చెప్పకుండా ప్రజాసేవ గురించి చెప్పాడు బాంకువాళ్ళు విన్నారు. గేదెకోసం ఇన్సూరెన్స్ వాళ్ళిచ్చేది మినహాయించి మిగతాది చెల్లించమన్నారు. సీతాలుకు తెలీకుండా రెండొందల చిల్లర వెంకయ్యనాయుడు చెల్లించేసాడు. అయితే వెంకయ్యనాయుడు బాంకువాళ్ళ చేత అప్పు మాపీ చేయించాడని సీతాలుకు చెప్పాడు.

సీతాలు ఆకాశంలో ఎగిరాడు.

వెంకయ్యనాయుడి గొప్పతనం గురించీ అతని దీనజనోద్ధరణ గురించి కోకిలాగా అరుస్తూ వీధి వీధికీ తిరిగాడు.

అతను పరుగెత్తినా రొప్పు రాలేదు. అప్పుపోయిన మాట అతనికి పదే పదే గుర్తుకొస్తోంది.

ఎలక్షన్లలో వెంకయ్యనాయుడికి విజయం లభించింది.

వెంకయ్యనాయుడు సీతాలు భుజం తడుతూ అన్నాడు.

"కూలి దొరక్క పస్తులుండిపోవాల్సి వస్తుందని భయపడిపోమాకురోరేయ్! పెళ్ళాం పిల్లల్తో మన సావిట్లోనే వుండి పొలంపన్లవీ చూసుకో."

సరేనన్నట్టుగా తల ఊపాడు సీతాలు.

సీతాలుగాడి గేదె పులివాత పడింది. కాని-సీతాలుగాడు పులినోట్లో పడ్డాడు •